క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప

చౌడేపల్లె: మండలంలోని లద్దిగం గ్రామం వద్ద అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం భూమి పూజ చేశారు. లద్దిగం గ్రామ అంబేడ్కర్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్న కార్యక్రమానికి చిత్తూరు మాజీ ఎంపీ ఎస్.రెడ్డెప్ప, ఎస్కే యూనివర్సిటీ రిటైర్డ్ ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి గౌతమి కలిసి విగ్రహ ఏర్పాటుకు పునాదిరాయివేశారు. అంబేడ్కర్ ఆశయ సాధనకోసం గ్రామ కమిటీ నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. సర్పంచ్ కృష్ణారెడ్డి, బ్యాంకు రెడ్డెప్ప, కమిటీ సభ్యులు మునస్వామి, లాజర్, చంద్రబాబు, సుదర్శన్, రమేష్, కృష్ణమూర్తి తదితరులున్నారు.

పేద విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆర్థిక సాయం

పుంగనూరు: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ ఆధ్వర్యంలో క్లబ్ ప్రతినిధులు కలసి ఆదివారం పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. ఉన్నత చదువులు చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున, మరో టైలర్ మణికంఠకు కుట్టుమిషన్‌ను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు సరస్వతి, బాలసుబ్రమణ్యం, రఘునాథరెడ్డి, కేశవరెడ్డి, మహిపాల్‌రెడ్డి, సుధాకర్‌రావు, సురేష్, వరదారెడ్డి పాల్గొన్నారు.

గోవిందమ్మకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

సదుం: మండలంలోని బయారెడ్డిగారిపల్లెకు చెందిన విశ్వానాథరెడ్డి తల్లి గోవిందమ్మ అస్వస్థతతో ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆమె దశ దిన కర్మక్రియలో వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి, మనోహర్ రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు టపాకాయల పంపిణీ



టపాకాయలు అందుకున్న కార్మికులతో బీసీ ఎన్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

కుప్పంరూరల్: బీసీ ఎన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మున్సిపాలిటీలోని కార్మికులకు లక్ష రూపాయల విలువ చేసే టపాకాయలను ఉచితంగా అందజేశారు. ఆదివారం కుప్పం పబ్లిక్ స్కూల్ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా కార్మికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ నాగరాజు, వైస్ చైర్మన్ డా.సునీల్‌రాజ్, కార్యదర్శి సాగర్ రాజ్ తదితరులు ఉన్నారు.

బోయకొండ కిటకిట

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. సెలవు దినం కావడంతో భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. విద్యార్థులు, యువత, ఉద్యోగులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. కోర్కెలు తీరిన భక్తులు దీపాలు వెలిగించి, బోణాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. క్యూలైన్లలో భక్తుల రద్దీతో తోపులాటలు చోటుచేసుకున్నాయి.

పుస్తక పఠనంతోనే జ్ఞానం



ప్రబోధానంద రచించిన పుస్తకాలపై ప్రచారం

కుప్పంరూరల్: పుస్తకాల పఠనంతోనే జ్ఞానం సిద్ధిస్తుందని ప్రబోధానంద సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ అన్నారు. ఆ సంస్థ ప్రతినిధులు ఆదివారం గరిగచీనేపల్లి, ఎర్రమన్నుగుంత గ్రామాల్లో ప్రబోధానంద రచించిన పుస్తకాలపై ప్రచారం చేశారు. కృష్ణ మాట్లాడుతూ, గురు శిష్యుల తలలో జ్ఞాన జ్యోతి వెలిగించి యోగ మార్గంలో నడిపిస్తారనడానికి నిదర్శనంగానే దీపావళి జరుపుకోవడం అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు కృష్ణమూర్తి, శరవణ, దేవరాజు, రంగప్ప, లోకేష్, శశాంక్, రాజ్‌కుమార్, పూజ, వెంకటలక్ష్మీ, ఇందిరా, విమల ఉన్నారు.

పాతురునత్తం గ్రామం వద్ద గుంతల రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



పుంగనూరు - ఎంబీటీ రోడ్డు నుంచి వెళ్లే పూజగానిపల్లె రోడ్డు దుస్థితి



పుంగనూరు - నల్లగుట్లపల్లె తండా వద్ద గుంతలు పడి నీరు నిలిచిన దృశ్యం



అడుగుకో గుంత.. ఎన్నాళ్లీ చింత?

దూర ప్రాంతాల్లో ఉద్యోగ రీత్యా వెళ్లి పండుగ సమయంలో స్వగ్రామాలకు చేరుకుంటున్న గ్రామీణులు రోడ్ల దుస్థితి చూసి అవాక్కైపోతున్నారు. సంక్రాంతి కెళ్లాక గుంతలు లేని రోడ్లు ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటనలు గుప్పించింది. అయితే దీపావళి పండుగకు కూడా గుంతలు పడిన రోడ్లు బాగుచేయలేదని గుర్తించారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు అడుగుకో గుంత ఉండడంతో ఇంకా ఎన్నాళ్లీ చింత తప్పదోని వాపోతున్నారు. పలమనేరు నియోజకవర్గంలో దాదాపు 250 కి.మీ. తారురోడ్లు ఉండగా వాటిల్లో 60 శాతం రోడ్లు వర్షాల కారణంగా చిత్తడిగా మారాయి. కానీ కూటమి ప్రభుత్వం వీటిని పట్టించుకున్న పాపాన పోలేదు. పండుగకు ఇక్కడికొచ్చే వాళ్లు ఈ రొచ్చు రోడ్లపై ప్రయాణించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పలమనేరు: మండలంలో రహదారులు మరీ అధ్వాన్నంగా తయారయ్యాయి. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు బురదగుంటలుగా మారాయి. కొలమాసనపల్లి పంచాయతీ ఎర్రగొండేల్లి– మాదిగబండ రహదారిలో రోడ్డుపై వాన పడితే నాలుగుడుగుల నీరు చేరి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో ద్విచక్ర వాహనాల్లో వెళ్లాలన్నా వీలు కాని పరిస్థితి నెలకొంది. కల్లాడు నుంచి చెన్నుపల్లి, పలమనేరు సమీపంలోని గుడియాత్తం రోడ్డు నుంచి మండిపేటకోటూరు మార్గంలో తావడపల్లి మీదుగా సముద్రపల్లి రోడ్డు పనులు చేపట్టారు. అయితే కంకర పోసి పనులు ఆపేశారు. దీంతో ఆరోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది. మొసలిమడుగు వద్ద వంటిండ్ల రోడ్డు వర్షాలతో రొచ్చురొచ్చుగా తయారైంది.



వెంగంవారిపల్లె నుంచి బైరెడ్డిపల్లెకు వచ్చే రహదారి దుస్థితి

- ఇప్పటివరకూ తూతూమంత్రంగా మరమ్మతులు
- ఈ మార్గాల్లో వెళ్లలేక నానాఅగచాట్లు పడుతున్న ప్రజలు
- ఇది ప్రస్తుతం పల్లె రోడ్ల దుస్థితి
- పట్టించుకోని పాలకులు

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె నుంచి పాతురునత్తం, పాతపేట, టీఎస్ కుప్పం, గౌనితిమ్మేపల్లె, కడపనత్తం, కడతట్లపల్లె, కల్లిగుట్ట, వెంగంవారిపల్లె తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలతో నిండిపోయాయి. ఆ గుంతల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పడిన రోడ్లపై ప్రయాణం నరకయాతనంగా మారింది. వాహనాలు రిపేర్లు కావడంతోపాటు జేబులకు చిల్లులు పడుతున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు గడుస్తున్నా అధ్వానంగా ఉన్న గుంతల రోడ్లకు కనీసం మరమ్మతులు చేయకపోవడం విడ్డూరంగా ఉంది.

గతుకుల రోడ్డే దిక్కు

శాంతిపురం: మండలంలోని 64 పెద్దూరు నుంచి సి.బండపల్లి పంచాయతీ ముద్దనపల్లి, రాళ్లపల్లి, దొమ్మరతిప్పనపల్లికి వెళ్లే తారు రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. ఎక్కడికక్కడ కంకర తేలి, గుంతలు ఏర్పడటంతో స్థానికులకు ఈ మార్గంలో ప్రయాణం నరకంగా మారింది. వాహనాలు వెళ్లేందుకే కాక కాలినడకకు ఇబ్బంది కరంగా తయారైంది. దీంతో ఈ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి, రాళ్లబూదుగూరు, కేజీఎఫ్ లాంటి సమీప పట్టణాలకు వెళ్లాలంటే ఐదు కిలోమీటర్లకు పైగా అదనపు దూరం ప్రయాణించి బేవనపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు.

మరమ్మతులకు నోచుకోని రోడ్లు

పుంగనూరు: కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లు మరమ్మతులకు నోచుకోలేదు. ఫలితంగా గత నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై గుంతల్లో నీరు చేరి ప్రమాదాల నిలయంగా మారాయి. ఈ రహదారుల్లో ప్రయాణించే వేలాది మంది ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. ఎంబీటీ రోడ్డు నుంచి పూజగానిపల్లె వెళ్లే రహదారిలో హైస్కూల్ ముందు భారీ గుంతలు పడ్డాయి. పాళెంపల్లె, నల్లగుట్లపల్లె తండాలకు వెళ్లే రహదారిలో గుంతలు పడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. పుంగనూరు నుంచి శంకర్రాయలపేటకు వెళ్లే రహదారి, కుమ్మరగుంట రోడ్డు గుంతలు పడి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తోంది.



పలమనేరు నుంచి సముద్రపల్లికి వెళ్లే రోడ్డుపై పోసిన కంకర



జల్లి తేలి గుంతలమయమైన కొలమాసనపల్లి -నెల్లిపట్ల రోడ్డు

రోడ్లన్నీ చిత్తడి



మా గ్రామంవద్ద వంటిండ్లుకు వెళ్లే మార్గం బురదగుంటగా మారింది. బురద కారణంగా కనీసం నడిచివెళ్లేందుకు కూడా వీలు కావడం లేదు. బైక్‌పై వెళితే జారి పడుతున్నారు. ఈ మార్గంలో రోడ్డు మంజూరైందని చెబుతున్నారేగానీ ఇప్పటి దాకా పనులు చేపట్టలేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

–ఉమాపతి, మొసలిమడుగు, పలమనేరు మండలం

నూతన వధూవరులకు పెద్దిరెడ్డి ఆశీస్సులు



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

రొంపిచెర్ల: నూతన వధూవరులను మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం ఆశీర్వదించారు. మండలంలోని జాండ్లవారిపల్లె గ్రామ పంచాయతీ కన్నంకాడ దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్ర కుమార్తె విజయమాళికను పీలేరు మండలం కావలిపల్లెకు చెందిన ప్రేమకుమర్‌తో వివాహం జరిపించారు. ఈ వివాహ వేడుకలకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

జల్లిపేట వద్ద వంతెన నిర్మించాలి

పలమనేరు: మండలంలోని జల్లిపేట గ్రామానికి వెళ్లే రహదారిలో కౌండిన్య నదిపై వంతెన నిర్మించాలని ఇందుకోసం స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చొరవచూపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. జల్లిపేట వద్ద కౌండిన్య కారణంగా గ్రామస్తులకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో సీపీఎం నాయకులు ఆదివారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ రోడ్డు మీదుగా జల్లిపేట, వెంకటేశపురం కాలనీ, ముడివారిపల్లి గ్రామాలకు రాకపోకలు లేకుండా పోయాయన్నారు. కౌండిన్య నది ప్రవహించినప్పుడల్లా ఇక్కడి రోడ్డు నీటి ప్రవాహంతో కొట్టుకుపోయి ఇబ్బందిగా మారిందన్నారు. కాబట్టి ఇక్కడ వంతెన కట్టాలని వారు డిమాండ్ చేశారు. ఇందులో సీపీఎం నాయకులు చెన్నకేశవులు, బుర్రా మంజునాథ్, రమేష్ పాల్గొన్నారు.



జల్లిపేట వద్ద వంతెన నిర్మించాలని చూపుతున్న సీపీఎం నేతలు

వైఎస్సార్‌సీపీ నాయకుడికి నివాళి

పుంగనూరు: మండల వైఎస్సార్ సీపీ నాయ కుడు పాళెంపల్లె విజయ్‌కుమార్‌రెడ్డి కుమారుడు నరసింహారెడ్డి(32) గత వారం మృతి చెందారు. ఆయనకు ఆదివారం దశదిన కర్మక్రియల కార్యక్రమం నిర్వహించారు. దీనికి మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బోయకొండ మాజీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు కొండవీటి నాగభూషణం, వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్‌వింగ్ కన్వీనర్ కొత్తపల్లె చెంగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అమరనాథరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రారెడ్డి యాదవ్‌తోపాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నరసింహారెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పల్లెల్లో దీపావళి శోభ!



పలమనేరులోని గంగమ్మ గుడి వీధిలో పండుగ సందడి



పుంగనూరు బీఎంఎస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాలు

పలమనేరు: పట్టణ పరిధిలోని ప్రజలు ఆదివారం నరకచతుర్దశి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. నేటి దీపావళికి అవసరమైన పూజసామగ్రి కొనుగోళ్లతో పట్టణంలో సందడిగా మారింది. వర్షం తెరిపిచ్చినప్పుడు జనం పండుగ సామగ్రి కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణంలోని శివాలయం వీధి, గంగమ్మగుడి వీధి. బజారు, జవిళి వీధులు జనంతో కిటకిటలాడాయి. వర్షంతో టపాసుల వ్యాపారులకు దిగాలు తప్పడంలేదు. పూజ సామగ్రి ధరలు అమాంతం పెంచేశారు.

నేటి దీపావళికి సర్వం సిద్ధం

పుంగనూరు: దీపావళి పండుగను ప్రజలు సోమ, మంగళవారాల్లో నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. పట్టణంలోని బీఎంఎస్ క్లబ్‌లో టపాకాయల దుకాణాలు, ఎంబీటీ రోడ్డులో నోముదారాలు, లక్ష్మీకాసులు వెండి, బంగారుతో చేసిన వస్తువుల విక్రయాలు ఊపందుకున్నాయి. పండుగ సందర్భంగా ఇళ్లు, వ్యాపార కేంద్రాలు, ఫ్యాక్టరీలు, వాహనాలకు పూజలు చేసుకుంటున్నారు. పుంగనూరు ప్రధాన పట్టణం కావడంతో వేలాది మంది తమకు కావాల్సిన పండగ సామగ్రి కోసం తరలివచ్చారు. దీంతో పట్టణం కిక్కిరిసింది.



పలమనేరు దుకాణాల్లో నోము దారాలు

వర్ష బీభత్సం.. పంట నష్టం



ఓదులపేట వద్ద చెరువులను తలపిస్తున్న వరి పొలాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న చారాల పెద్ద చెరువు మొరవ

- కోతకు గురైన రోడ్లు
- పలు గ్రామాల రాకపోకలకు అంతరాయం

చౌడేపల్లె: ఎడతెరిపి లేకుండా శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. మండల వ్యాప్తంగా కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండిపోయి మొరవలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆయకట్టు చెరువుల కింద మొరవల నుంచి వచ్చే వరద నీటి కారణంగా సుమారు 200 ఎకరాల్లో వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చారాల చెరువు మొరవ రెండువైపులా ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జంగాలపల్లెకు రాకపోకలకు అంతరాయం కలిగింది. ఓదులపేట వద్ద వరదనీటి కారణంగా వరిపంటలు నీట మునిగిపోయాయి. ఓదులపేటనుంచి పలమనేరు రోడ్డుకు వెళ్లే మార్గం కోతకు గురైంది. పంటలపై మట్టి పేరుకుపోయింది. మేకలచిన్నేపల్లె వద్ద నాయుని చెరువు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కట్టపై రాకపోకలు నిలిపేశారు. ఏ.కొత్తకోట పరిధిలోని పీరత కుంట, పైనున్న ఒడ్డు పరవళ్లు తొక్కుతున్నాయి. ఎప్పుడు కట్టలు తెగుతాయోనంటూ ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అటువైపు చూడని అధికారులు

మండలంలో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురిశాయి. ఎటుచూసినా వాగులు, వంకలు ప్రవహించడంతోపాటు పంటలకు తీవ్ర నష్ట వాటిల్లింది. లోతట్టుప్రాంతాల ప్రజలను కనీసం అప్రమత్తం చేయడం, చెరువుల పర్యవేక్షణ కోసం కనీసం అధికారులెవ్వరూ గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రమాద స్థితిని వివరించినా స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు.



ఓదులపేటలో నీట మునిగిన వరి పంటలు





వరద ఉధృతికి కోతకు గురైన చౌడేపల్లె మండలం ఓదులపేటకు వెళ్లే రోడ్డు, వరి పంటను ముంచెత్తిన వరద